క్లుప్తంగా

దళారులను నమ్మి మోసపోవద్దు: డీఎస్పీ



చల్మెడలో రైతులతో మాట్లాడుతున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి

నిజాంపేట(మెదక్): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చల్మెడ గ్రామంలో కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న రైతులతో డీఎస్పీ మాట్లాడుతూ.. వరి ధాన్యం కొనుగోలు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ ఆధ్వర్యంలో గ్రామసభలు



మాట్లాడుతున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ఉపాధిహామీ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. పెద్దశంకరంపేటతో పాటు ఆరేపల్లి తదితర గ్రామాల్లో ఈజీఎస్ గ్రామసభలు నిర్వహించి, గతంలో నిర్వహించిన పనులను డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీలు పరిశీలించారు. ఈ నివేదికలను మండల అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ నవాజుద్దీన్, టీఏలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడి కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

పాపన్నపేట(మెదక్): మండలంలోని యూసుఫ్‌పేట గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ కార్యకర్త చామంతుల రమేశ్ మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి అన్నారు. ఆదివారం ఆమె బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శ్రీనాథ్‌రావు, ఏర్పుల దాసయ్య, మాజీ ఎంపీటీసీ జ్యోతి, సాయిలు, టీఆర్ఎస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, శేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ జ్యోతి, గోపాల్, వార్డ్ మెంబర్లు అశోక్, రాజేందర్, కిషన్ రెడ్డి, సిద్దిరెడ్డి, ఏర్పుల శ్రీనివాస్, సాయిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కిషన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె వారికి ధైర్యం చెప్పి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పెళ్లికి వెళ్తుండగా ప్రమాదం



గాయపడ్డ యాదా గౌడ్

కొల్చారం(నర్సాపూర్): మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారిపై జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కొడిపల్లి మండలంలో ఆదివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దేవులపల్లి గ్రామానికి చెందిన యాదగౌడ్ కొల్చారంలోని రోడ్డు పక్కన ఉన్న ఫంక్షన్ హాల్లో వివాహానికి హాజరయ్యేందుకు తన బైక్‌పై బయల్దేరాడు. సరిగ్గా వివాహవేదిక వద్దకు చేరుకుని ఫంక్షన్ హాల్ వైపు బైక్‌ను మళ్లిస్తుండగా అదే సమయంలో మెదక్ వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్రవాహనం అతివేగంగా వచ్చి యాదగౌడ్ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో యాదగౌడ్ కుడి కాలు విరగడంతోపాటు పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కేసు నమోదు చేసి బాధితుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రశాంతంగా గ్రూప్‌- 3 పరీక్షలు

నర్సాపూర్: పట్టణంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్‌– 3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో మూడు పరీక్ష సెంటర్లు ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం జరిగిన పరీక్షలకు ఆర్‌డీఓ మహిపాల్, సీఐ జాన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ పర్యవేక్షించారు. కాగా ఉదయం ఒక నిమిషం ఆలస్యంగా ఆరుగురు అభ్యర్థులు వచ్చారు. పరీక్షకు అనుమతించాలని వారు పరీక్షల నిర్వహణ అధికారులను బతిమిలాడినా.. లోపలికి అనుమతించకపోవడంతో వారు వెనుదిరిగారు.



అభ్యర్థులు వేడుకుంటున్నా నిమిషం నిబంధనతో అనుమతించని పోలీసులు



నర్సాపూర్: పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్‌లను సరిచూసుకుంటున్న అభ్యర్థులు

పరీక్ష కేంద్రం పరిశీలన

తూప్రాన్: పట్టణంలో నిర్వహిస్తున్న గ్రూపు–3 పరీక్ష కేంద్రాన్ని అదనపు ఎస్పీ మహేందర్ పర్యవేక్షించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీచైతన్య స్కూల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 576 మంది విద్యార్థులకు 229 మంది మాత్రమే హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలకు ఏడుగురు విద్యార్థులు వివిధ కారణాలతో రెండు నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. ఆర్డీఓ జయచంద్రారెడ్డి, పోలీసుల కాళ్లపై పడి విద్యార్థులు ఎంత ప్రాధేయపడినా అనుమతించలేదు. దీంతో వారు వెనుదిరిగారు.

బీఆర్ఎస్‌ది రైతులపై కపట ప్రేమే..

చిన్నశంకరంపేట(మెదక్): రైతులపై కపట ప్రేమ చూపుతూ పాదయాత్రకు సిద్ధమవుతున్నారని బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్‌చంద్రం విమర్శించారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయంలో రైస్‌మిల్లర్లకు ఎలాంటి గ్యారంటీ లేకుండా ధాన్యం తరలించడంతోనే ధాన్యం తప్పుదోవ పట్టి, నేడు రైస్‌మిల్‌లు వేలం వేసే పరిస్థితి వచ్చిందన్నారు. దీంతో రైస్‌మిల్లర్ల గ్యారంటీ తీసుకొని ధాన్యం తరలించేందుకు కొద్దిగా సమయం పట్టిందన్నారు. ఇప్పుడు ఎక్కడ కూడా ధాన్యం ఆగడంలేదని, వెంట వెంటనే కాంటా చేస్తూ రైస్‌మిల్‌లకు తరలించడం బీఆర్ఎస్ నాయకులకు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఎం జరిగిందో ఇప్పుడేం జరుగుతుందో ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. ఇప్పటికే రుణమాఫీ చేసిన ప్రభుత్వం సన్నవడ్లకు బోనస్ కూడా అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లేశం, యాదగిరి, శ్రీనివాస్, నాగులు ఉన్నారు.

సీడీపీఓ కార్యాలయం ఎక్కడ..?



బోర్డు లేకుండా ఒక ఇంట్లో కొనసాగుతున్న సీడీపీఓ కార్యాలయం

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రంలో సీడీపీఓ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అల్లాదుర్గంలో 2016లో సీడీపీఓ కార్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొన్నేళ్లు ఈ కార్యాలయాన్ని మండల పరిషత్ కార్యాలయంలో, మరి కొన్నేళ్లు అద్దెభవనంలో నిర్వహించారు. ప్రస్తుతం సీడీపీఓ కార్యాలయాన్ని ఒక అద్దె భవనంలోని చిన్న ఇంట్లోకి మార్చారు. రెండు నెలలు కావస్తున్నా.. ఉద్యోగులకు, ప్రజలకు సమాచారం లేకపోవడంతో కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక ఇబ్బందులకు గురవుతున్నారు. మార్చిన కార్యాలయానికి కనీసం బోర్డు పెట్టకపోవడం ఎంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా తెరవకపోవడం, టీచర్లు సమయ పాలన పాటించకుండా విధులు నిర్వహిస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేయడానికి అల్లాదుర్గం వస్తే కార్యాలయం ఎక్కడో ఉందో తెలియక వారు వెళ్లిపోతున్నారు.

వేధిస్తున్న కూలీల కొరత



టేక్మాల్ శివారులో పత్తిపంట

- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- ఇబ్బంది పడుతున్న రైతులు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలో వారం పదిరోజుగా సాగు పనులు ఊపందుకున్నాయి. కూలీల కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారు. సమయానికి కూలీలు దొరకకపోవడంతో చేతికి వచ్చిన పంట ఇంటి దాకా వస్తుందా అని సతమతమవుతున్నారు. మండలంలోని తంప్లూర్, కాద్లూర్, వెంకటాపూర్, బర్దిపూర్, ఎలకుర్తి, బొడగట్టు, సూరంపల్లి, కమ్మర్తికత్త, అచ్చన్నపల్లి, సంగ్యాతాండా, బొడ్మట్‌పల్లి, పల్వంచ, దాదాయిపల్లి, కుసంగి తదితర గ్రామాల్లో పత్తి, వరి, కంది, పేసరి, మినుము పంటలను అత్యధికంగా సాగు చేశారు. ఖరీఫ్‌లో జొన్నలు 11, మొక్కజొన్న 20, వరి 16156, పత్తి 4510, సోయాబీన్ 18, మినుములు 65, పెసరి 364, కందులు 116 ఇతర పంటలతో కలిపి మొత్తం 21396 ఎకరాల విస్తీర్ణంలో పంటలను సాగు చేశారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి తరుచుగా కురిసిన వర్షాలకు పంటలు ఏపుగా పెరగడంతో పాటూ ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. అత్యధికంగా సాగు చేసిన పత్తి, వరి, కంది, మొక్కజొన్న పంటలకు అత్యధిక పెట్టుబడి పెట్టి, మందులు పిచికారీ చేశారు. ప్రస్తుతం పంటలు చేతికి వచ్చిన సమయంలో కూలీల కొరత రైతులను బాధిస్తుంది.

పెరిగిన డిమాండ్..

ప్రస్తుతం వర్షాలు తగ్గి ఎండలు పెరగడంతో పది రోజులుగా మండలంలో వరిపంట కోత, పత్తితీతకు ఒకేసారి రావడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. ఒక్కోకూలీకి పత్తి తీసేందుకు కిలోకి చొప్పున రూ.10 నుంచి రూ.15 వరకు ఇస్తున్నారు. వరి కోసేందుకు ఇది వరకు కురిసిన వర్షాల కారణంగా భూమి పచ్చిగా ఉండడంతో వరికోత మిషన్లు రాలేకపోతున్నాయి. దీంతో కూలీలకు ధరలు అమాంతం పెరిగాయి. ఒక్కో మహిళా కూలీకి రూ.420 నుంచి రూ.600ల వరకు ఇస్తున్నారు. అయినా పనులు అందరికీ ఒకేసారి రావడంతో డబ్బులు ఎక్కువగా ఇస్తామంటున్నా.. దొరకని పరిస్థితి. వరికోత మిషన్లు వెళ్లే చోట సైతం ధరలు గంటకు రూ.3వేలకు పైగా తీసుకోవడంతో రైతులు జంకుతున్నారు. ఈ సమయంలో వర్షం కురిస్తే పత్తి మొత్తం నేలపాలవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వందలాది మంది కూలీలను పిలిపించి పత్తిని తీయిస్తున్నారు. కూలీల ధరలతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితిలేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

ఆగి ఉన్న ఆటోను ఢీకొన్న డీసీఎం

వెల్దుర్తి(తూప్రాన్): ప్రయాణికులను ఎక్కించుకోవడానికి రోడ్డు ప్రక్కన నిలిపి ఉంచిన ఆటోను వెనుక నుంచి డీసీఎం వాహనం వేగంగా ఢీ కొట్టడంతో నలుగురు ప్యాసింజర్లకు తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రం మాసాయిపేటలో ఆదివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. చేగుంట నుంచి తూప్రాన్ వైపు వెళ్తున్న ఆటో మాసాయిపేటలో ప్రయాణికులను ఎక్కించుకోవడానికి రోడ్డు పక్కన నిలిపి ఉంచాడు. ఈ క్రమంలో వెనుకనుంచి వచ్చిన డీసీఎం వాహనం ఆటోను ఢీ కొనడంతో ఆటో నుజ్జునుజ్జయ్యింది. ఆటోలో ప్రయాణిస్తున్న చందాయిపేటకు చెందిన అంజయ్య, మాసాయిపేట గ్రామానికి చెందిన గోపాల్, రవిలతో పాటు మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో అంజయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.



ప్రమాదంలో నుజ్జునుజ్జైన ఆటో

నేడు 14వ విడత సామాజిక తనిఖీ

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఈజీఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు సకాలంలో హాజరుకావాలని ఆమె కోరారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

తూప్రాన్: పట్టణంలోని 13వ వార్డులో సీసీ రోడ్డు పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి కృష్ణ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ప్రత్యేక చొరవతో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్, ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా రూ.16లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు శ్రీశైలంగౌడ్, జ్యోతిరవీందర్ గుప్తా, బాణాపురంరాజు, రఘుపతి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

ఒకరికి తీవ్ర గాయాలు

వెల్దుర్తి(తూప్రాన్): వెనుక నుంచి ఓ కారు అతి వేగంతో బైక్‌ను ఢీ కొట్టడంతో ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండల కేంద్రం వెల్దుర్తి గ్రామశివారులో శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రసాద్ శనివారం సాయంత్రం విధులు ముగించుకుని తూప్రాన్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారులోని గంగమ్మ గుడి సమీపంలోకి చేరుకునే సరికి అదేసమయంలో వెనుకనుంచి అతి వేగంగా ఓ కారు వచ్చి ఢీ కొట్టింది. దీంతో ప్రసాద్ బైక్‌నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

శివ్వంపేటలో తాగునీటి కష్టాలు



శివ్వంపేట(నర్సాపూర్): గ్రామ పంచాయతీ ఎదుట ఖాళీ బిందెలతో గ్రామస్తుల నిరసన

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల నుంచి తాగునీటి సరఫరా సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోయారు. నీటి ఎద్దడిని నిరసిస్తూ పలు కాలనీవాసులు ఆదివారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య గురించి పంచాయతీ సిబ్బందికి చెప్పినా.. పట్టించుకోవడం లేదని పైనం యాదగిరి, అరిగే ముత్యాలు, వెంకటేష్, అశోక్ ఆరోపించారు. ఈ విషయం గురించి పంచాయతీ కార్యదర్శి రమాదేవి దృష్టికి తీసుకెళ్లగా.. వారం రోజుల నుంచి మిషన్ భగీరథనీరు సక్రమంగా గ్రామంలోని రక్షిత వాటర్ ట్యాంకుల్లోకి రాకపోవడంతో ఇబ్బందులు తలెత్తయని ఈ విషయం గురించి సంబంధిత భగీరథ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

నత్నయ్యపల్లిలో..

నర్సాపూర్ రూరల్: మండలంలోని నత్నయ్యపల్లి గ్రామస్తులు వారం రోజులుగా తీవ్ర తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ తాగునీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్తులు వ్యవసాయ బోర్ మోటార్లను ఆశ్రయించి తాగునీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. ప్రత్యామ్నాయంగా గ్రామానికి నీటి సరఫరా అయే బోరు మోటార్లు సైతం పాడైపోవడంతో మరమ్మతులు చేయడం లేదని గ్రామస్తులు తెలిపారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరా అధికారులకు నీరు రావడంలేదని విన్నవించినా.. వారు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ విషయమై భగీరథ అధికారుల వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



నల్లపోచమ్మను దర్శించుకుంటున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లా కమిషనర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేష్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. బోనాలు సమర్పించి, ఒడిబియ్యం పోసి, మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి, వాహనాలకు పూజలు చేయించుకున్నారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్ రెడ్డి, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో..

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో కొలువైన లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కొనేరులో స్నానమాచరించి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. దీంతో పాటు గుట్టపైన కొలువైన స్వామి వారిని దర్శించుకొని, దీపాలు వెలిగించారు. ఆలయ అర్చకులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ శశిధర్‌గుప్తా తెలిపారు.

‘ఆర్యవైశ్య’ చైర్‌పర్సన్‌కు సన్మానం



రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కవితను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

నర్సాపూర్: రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాతను ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఆదివారం సన్మానించారు. పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో నిర్మిస్తున్న శ్రీ వాసవి కన్యక పరమేశ్వరీ మాత ఆలయాన్ని ఆమె సందర్శించి నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు శ్రీనివాస్, ఇతర ప్రతినిధులు చంద్రశేఖర్, మల్లేశం, హరీశ్, మాణిక్యం, విఠల్, నవీన్, వెంకన్న, రాంలు, ప్రభాకర్, శ్రీనివాస్‌తో పాటు తదితరులు రాష్ట్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్‌తో పాటు జగద్గిరిగుట్ట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ప్రకాష్‌లను శాలువాలతో సన్మానించారు.

ముక్కు మూసుకోవాల్సిందే..

దుబ్బాక: మున్సిపాల్టీ పరిధిలోని 12వ వార్డులో డ్రైనేజీలు అధ్వానంగా తయారు కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వార్డులోని పలు కాలనీల్లో మురుగు కాలువల్లో చెత్త, చెదారం, గడ్డి నిండిపోయాయి. దీంతో మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయని, రోగాల భారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీలు శుభ్రపరిచి తమ బాధలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



12వ వార్డులో అధ్వానంగా డ్రైనేజీ

మా ఆస్తులు మీకెందుకు చెప్తాం

- సర్వేలో గ్రామస్తుల సమాధానం

చిన్నశంకరంపేట(మెదక్): మా ఆస్తులు, అప్పులు మీకెందుకు చెప్తాం.. మీరేం మా అప్పులు తీర్చేటోళ్ల.. అర్చేటోళ్ల అని గ్రామస్తులు మండల కేంద్రంలో సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లకు సమాధానం చెప్తున్నారు. దీంతో వారు చేసేదేమిలేక చెప్పింది రాసుకొని మరో ఇంటికి వెళ్లన్నారు. సర్వేలో గ్రామస్తులు చాలా వరకు తమకున్న ఆస్తుల వివరాలు చెప్పేందుకు నిరాకరిస్తున్నారు. కొందరైతే తమకు ఇల్లులేదని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావాలని కోరుతున్నారు. మరి కొందరు తమకు చాలా రోజులుగా పింఛన్ రావడంలేదని, వచ్చేలా రాయమని అడుగుతున్నారు. ఆదివారం కూడా మండల కేంద్రంతో ఇతర గ్రామాల్లో ఉదయం నుంచి సర్వే కొనసాగుతోంది. ఎంపీడీఓ దామోదర్ మాట్లాడుతూ.. వివరాలు కచ్చితంగా చెప్పాలని ఎం లేదని, కుటుంబ సభ్యులు చెప్పిన సమాధానం మాత్రమే ఎన్యుమరేటర్లు రాస్తున్నారని చెప్పారు.

ప్రతి ఇంటినీ సర్వే చేయాలి

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రతి ఇంటినీ సర్వే చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ ఎన్యుమరేటర్లకు సూచించారు. ఆదివారం మండల కేంద్రం కౌడిపల్లిలో సర్వే సర్వే ఫారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటిని తప్పులు లేకుండా పూర్తి వివరాలు సేకరించి సర్వే చేయాలని చెప్పారు. సర్వే వివరాలను ప్రతీరోజు అధికారులకు తెలియచేయాలన్నారు. సర్వే దరఖాస్తులను భద్రపర్చాలన్నారు. నిర్లక్ష్యం చేస్తూ చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పుణ్యదాస్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, గ్రామస్తులు పాల్గొన్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్



చిన్నశంకరంపేట(మెదక్): సర్వే నిర్వహిస్తున్న అధికారులు



శివ్వంపేట(నర్సాపూర్): పిల్లుట్లలో సర్వే చేస్తున్న సిబ్బంది

పూర్తి వివరాలు ఇవ్వాలి

శివ్వంపేట(నర్సాపూర్): సర్వే కోసం ఇళ్ల వద్దకు వచ్చే సిబ్బందికి ప్రజలు పూర్తిస్థాయి సమాచారం ఇవ్వాలని ఎంపీడీఓ నాగేశ్వర్ అన్నారు. మండల వ్యాప్తంగా ఎన్యుమనేటర్లు ఇంటింటి సర్వే ముమ్మరంగా చేస్తున్నారు. ఆదివారం నిర్వహించిన సర్వే తీరుని ఎంపీఓ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి పరిశీలించి పలు సూచనలు చేశారు.